క్లుప్తంగా

నేడు ఉచిత పశువైద్య శిబిరం

గండేడ్‌: స్థానిక మండల పరిధిలోని కొంరెడ్డిపల్లిలో ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించనున్నట్లు పశువైద్యాధికారి రాంప్రసాద్‌ తెలిపారు. ఉదయం 9గంటలకు ఈ శిబిరాన్ని ప్రారంభించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ శిబిరంలో పశువులకు చూడీ పరీక్షలు, గర్భకోశ వ్యాధి చికిత్సలు తదితర వైద్య పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

దేవరకద్ర: స్థానిక మండల సర్వసభ్య సమావేశాన్ని శుక్రవారం ఉదయం 11 గంటలకు మండల పరిషత్‌ సమావేశ మందిరంలో ప్రారంభమవుతుందని ఎంపీడీఓ శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ రమాదేవి అధ్యక్షతన జరిగే సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, అన్ని గ్రామాల సర్పంచ్‌లు, మండల పరిధిలోని అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని కోరారు.

రేవంత్‌రెడ్డిని కలిసిన జీఎంఆర్‌



దేవరకద్ర: టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని గురువారం హైదరాబాద్‌లో జిల్లా కాంగ్రెస్‌ పార్టీ అధ్యక్షుడు జి.మధుసూదన్‌రెడ్డితో పాటు జిల్లా ఎన్‌ఎస్‌యూఐ నాయకులు కలిశారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డిని వారు శాలువాతో సన్మానించి జిల్లాలో పార్టీ పరిస్థితిపై చర్చించారు. కాంగ్రెస్‌ పార్టీని జిల్లాలో మరింత బలోపేతం చేసేందుకు చేపట్టాల్సిన కార్యక్రమాలపై చర్చించారు.

దళిత గిరిజన ఆత్మగౌరవ సభను జయప్రదం చేద్దాం

జడ్చర్ల టౌన్‌: ఈనెల 22న నాగర్‌కర్నూల్‌ జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న దళిత గిరిజన ఆత్మగౌరవ మహాసభను జయప్రదం చేద్దామని టీపీసీసీ ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఎం.చంద్రశేఖర్‌ పిలుపునిచ్చారు. ప్రభుత్వ అతిథిగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సభకు నియోజకవర్గంలోని కాంగ్రెస్‌ పార్టీ శ్రేణులు, కార్యకర్తలు, పార్టీలకతీతంగా దళితులు, గిరిజనులు తరలిరావాలని కోరారు. సమావేశంలో నాయకులు బుర్ల వెంకటయ్య, బుక్క వెంకటేశం, శ్రీధర్‌రెడ్డి, తిర్మల్‌రెడ్డి, గాంగ్యనాయక్‌, మినాజ్‌లు పాల్గొన్నారు.

బాలానగర్‌: ఈనెల 22వ తేదీన నాగర్‌కర్నూల్‌ జిల్లా గిరిజన సభను విజయవంతం చేయాలని కాంగ్రెస్‌ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి శంకర్‌ నాయక్‌, హరిసింగ్‌లు పిలుపునిచ్చారు. ఈనెల 22వ తేదీన నాగర్‌కర్నూల్‌ జిల్లాలో నిర్వహించే గిరిజన ఆత్మగౌరవ సభకు టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌ రెడ్డితో పాటు రాష్ట్ర నాయకులు హాజరవుతారని పేర్కొన్నారు. జడ్చర్ల నియోజకవర్గంలోని 222 తండాల నుంచి లంబాడా గిరిజనులు కదం తొక్కి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వెంకట్‌ నాయక్‌, హరిసింగ్‌ నాయక్‌, నీల్యానాయక్‌, బద్రునాయక్‌, సోమ్లు నాయక్‌, భాస్కర్‌ నాయక్‌, లక్ష్మణ్‌ నాయక్‌, హతిరాం నాయక్‌ తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీ డాక్టర్‌గా అపర్ణ

అడ్డాకుల: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలిగా డాక్టర్‌ అపర్ణ బాధ్యతలు చేపట్టారు. ఇటీవల జరిగిన బదిలీలో జడ్చర్ల అర్బన్‌ హెల్త్‌ సెంటర్‌లో పని చేస్తున్న డాక్టర్‌ శివకాంత్‌ను అడ్డాకుల పీహెచ్‌సీ మెడికల్‌ ఆఫీసర్‌గా కేటాయించగా ఆయన ఇక్కడ విధుల్లో చేరారు. మళ్లీ ఆయనను డిప్యూటేషన్‌పై జడ్చర్ల అర్బన్‌ హెల్త్‌ సెంటర్‌కు పంపించారు. ఆయన స్థానంలో గండీడ్‌ పీహెచ్‌సీ మెడికల్‌ ఆఫీసర్‌ అపర్ణను అడ్డాకులకు డిప్యూటేషన్‌పై కేటాయించగా బుధవారం ఆమె విధుల్లో చేరినట్లు సీహెచ్‌ఓ భాస్కర్‌ తెలిపారు.

ఇసుక ట్రాక్టర్‌ పట్టివేత

జడ్చర్ల: బాదేపల్లి నిమ్మబాయిగడ్డ ప్రాంతంలో ఎలాంటి అనుమతులు తీసుకోకుండా ఫిల్టర్‌ ఇసుకను తయారు చేస్తున్న వ్యక్తిని గురువారం అదుపులోకి తీసుకుని ఇసుక ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ మేరకు రంగనాయకుంట తండాకు చెందిన నేనావత్‌ మహేందర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

గుండెపోటుతో వ్యక్తి మృతి

రాజాపూర్‌: మండల కేంద్రానికి చెందిన చాకలి వెంకటయ్య (46) గురువారం తెల్లవారుజామున గ్రామశివారులో ఉన్న వాగులో లారీలో ఇసుకను లోడ్‌ చేసేందుకు వెళ్లాడు. అక్కడే గుండెపోటు వచ్చి కుప్పకూలిపోయినట్లు తోటి కూలీలు కుటుంబసభ్యులకు సమాచారం ఇవ్వగా వారు చూసేలోగా మృతి చెందినట్లు తెలిపారు. ఈ విషయంపై ఎస్‌ఐ వెంకట్‌రెడ్డిని వివరణ కోరగా ఫిర్యాదు అందలేదన్నారు.

గోవులను కాపాడాలి

జడ్చర్ల టౌన్‌: గోవులను కాపాడుకుందామని జిల్లా గుడిసెవాసుల సంఘం అధ్యక్షుడు అయ్యన్న గురువారం ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు. పంచభూతాలతోపాటు గో మాత ప్రకృతిలో ఎంతో ముఖ్యమని, అందుకే వాటిని కబేళాలకు తరలనివ్వకుండా గోమాత పరిరక్షణకు ప్రతి ఒక్కరూ నడుం బిగించాలని కోరారు.

ఉచితంగా కంటి పరీక్షలు

- అడిషనల్‌ కలెక్టర్‌ తేజస్‌ నందులాల్‌ పవర్‌

హన్వాడ: ప్రభుత్వం కంటి వెలుగు కింద ఉచితంగా కంటి పరీక్షలను చేయిస్తుందని అందరూ సద్వినియోగం చేసుకోవాలని అడిషనల్‌ కలెక్టర్‌ తేజస్‌ నందులాల్‌ పవర్‌ సూచించారు. గురువారం మండలంలోని సల్లోనిపల్లి, హన్వాడ, టంకరలలో ప్రారంభించారు. హన్వాడలో 156, సల్లోనిపల్లిలో 105, టంకరలో 171మందికి కంటి పరీక్షలు చేశారు.

మహబూబ్‌నగర్‌ రూరల్‌: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న కంటి వెలుగును ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌ బి.రాజేశ్వర్‌గౌడ్‌ సూచించారు. గురువారం ఆయన మండల పరిధిలోని ధర్మాపూర్‌లో ఎంపీపీ సుధాశ్రీతో కలిసి రెండవ విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు.

మహబూబ్‌నగర్‌ మున్సిపాలిటీ: పట్టణంలోని పది కేంద్రాల్లో మొదటిరోజు గురువారం 'కంటి వెలుగు' ప్రారంభమైంది. మొత్తం 1,495 మంది ఆయా కేంద్రాల్లో కంటి పరీక్షలు చేయించుకున్నారు.

కోయిల్‌కొండ: మండలంలోని కోయిల్‌కొండ, పారుపల్లి, కోత్లాబాద్‌లలో గురువారం కంటి వెలుగును ఎంపీపీ శశికళ, జెడ్పీటీసీ సభ్యుడు విజయ్‌భాస్కర్‌రెడ్డిలు ప్రారంభించారు.

చిన్నచింతకుంట: మండల కేంద్రంతోపాటు మద్దూర్‌లో ఏర్పాటు చేసిన కంటి వెలుగు కేంద్రాలను గురువారం ఎంపీపీ హర్షవర్ధన్‌రెడ్డి, జెడ్పీటీసీ వట్టెం రాజేశ్వరి ప్రారంభించారు.

బాలానగర్‌: మండల పరిధిలోని మొదంపల్లిలో కంటి వెలుగు కార్యక్రమాలను గురువారం గిరిజన కోపరేటివ్‌ చైర్మన్‌ వాల్యానాయక్‌, డీసీఎంఎస్‌ చైర్మన్‌ వాల్యానాయక్‌ ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని డీపీఓ వెంకటేశ్వర్లు పరిశీలించారు. బాలానగర్‌లో 278, మొదంపల్లిలో 153 మందికి పరీక్షలు చేసినట్లు పీహెచ్‌సీ వైద్యురాలు సృజన తెలిపారు.

గండేడ్‌/మహమ్మదాబాద్‌: నిరుపేదల జీవితాల్లో వెలుగులు నింపడానికే ప్రభుత్వం కంటి వెలుగు పథకాన్ని తీసుకొచ్చిందని పరిగి ఎమ్మెల్యే మహేశ్‌ రెడ్డి పేర్కొన్నారు. గండేడ్‌ మండల పరిధిలోని జానంపల్లి, అంచన్‌పల్లి, మహమ్మదాబాద్‌ మండల పరిధిలోని చిన్నాయిపల్లి, మహమ్మదాబాద్‌లలో శిబిరాలను ఎంపీపీ మాధవి, జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభించారు.

అడ్డాకుల: సీఎం కేసీఆర్‌ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమం ద్వారా అంధత్వ నిర్మూలనకు అందరం కలిసి కృషి చేద్దామని ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. అడ్డాకులలోగురువారం ఏర్పాటు చేసిన కంటి వెలుగు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. మొదటి రోజు 190 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు.

దేవరకద్ర: స్థానిక నియోజకవర్గ కేంద్రంలో గురువారం కంటి వెలుగు కార్యక్రమాన్ని ఎంపీపీ రమాదేవి ప్రారంభించారు.

జడ్చర్ల టౌన్‌: కంటి వెలుగు కార్యక్రమం ప్రపంచంలోనే గొప్పదని ఎమ్మెల్యే డా. లక్ష్మారెడ్డి అన్నారు. గురువారం మున్సిపాలిటి పరిధిలోని 1, 2 వార్డుల్లో ఆయన కంటి వెలుగు శిబిరాలను ప్రారంభించారు.

రాజాపూర్‌: మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక వైద్యశాలలో కంటివెలుగు కార్యక్రమాన్ని ఎమ్మెల్యే డా. లక్ష్మారెడ్డి ప్రారంభించారు.

అడ్డాకుల: మూసాపేట మండలంలోని జానంపేట, కొమిరెడ్డిపల్లిలలో జెడ్పీటీసీ సభ్యుడు జి.ఇంద్రయ్య సాగర్‌, ఎంపీపీ గూపని కళావతిలు కంటి వెలుగు శిబిరాలను ప్రారంభించారు.

భూత్పూర్‌: మండలంలోని హస్నాపూర్‌లో రెండవ విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని మండల ప్రత్యేక అధికారి సాయిబాబాతో కలిసి ఎంపీపీ కదిరెశేఖర్‌ రెడ్డి ప్రారంభించారు. మున్సిపాలిటీలోని 1వ వార్డులో అడిషనల్‌ కలెక్టర్‌ సీతారామారావు కంటివెలుగు కార్యక్రమాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు.

మిడ్జిల్‌: మండల కేంద్రంతో పాటు అయ్యవారిపల్లిలో ఎంపీపీ కాంతమ్మ కంటి వెలుగు శిబిరాలను ప్రారంభించారు.

నవాబుపేట: మండల కేంద్రంతో పాటు కొల్లూర్‌, కాకర్‌జాల్‌తండాలలో కంటి వెలుగు కార్యక్రమాన్ని జెడ్పీటీసీల సంఘం జిల్లా అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్‌ నర్సింలు ప్రారంభించారు.



భూత్పూర్‌లో వైద్యులను వివరాలు అడిగి తెలుసుకున్న అడిషనల్‌ కలెక్టర్‌ సీతారామారావు



అడ్డాకులలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి



జానంపల్లిలో వృద్ధురాలితో కంటి అద్దాల ఎలా ఉన్నాయని అడుగుతున్న ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

వృద్ధులదే హడావుడి



కావేరమ్మపేట 2వ వార్డులో కంటి వెలుగు శిబిరానికి వచ్చిన వృద్ధులు

జడ్చర్ల టౌన్‌: మండలంలో కంటి వెలుగు శిబిరాల్లో మొదటిరోజు వృద్ధులదే హడావుడి కనిపించింది. మున్సిపాలిటీ పరిధిలో 1, 2 వార్డుల్లో నిర్వహించిన 2 శిబిరాల్లో మొత్తం 215మందికి కంటి పరీక్షలు నిర్వహించి 41మందికి అద్దాలను అందజేశారు. అయితే జడ్చర్ల మండలం బండమీదిపల్లికి చెందిన జయమ్మ 2013లో కరువు పనికి వెళ్లగా సర్కారు కంప కొడుతుండగా ఎడమకన్నులో ముళ్లు గుచ్చుకుంది. అప్పట్లోనే కన్ను తీసివేయాలని డాక్టర్లు సూచించారు. ఈ మేరకు కంటి వెలుగు శిబిరం ప్రారంభానికి వచ్చిన ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి దృష్టికి జయమ్మ తన సమస్యను తీసుకెళ్లింది. దీంతో స్పందించిన ఆయన అవసరమైతే సొంతత డబ్బులతో సర్జరీ చేయిస్తానని భరోసా ఇచ్చారు.

ప్రతిభకు పదును పెట్టాలి



సైన్స్‌ ఫెయిర్‌కు వెళ్లే విద్యార్థులతో ప్రజాప్రతినిధులు, అధికారులు

గండేడ్‌: విద్యార్థులు తమ ప్రతిభకు పదును పెట్టి సత్తా చాటాలని ఎంపీపీ మాధవి, జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాస్‌రెడ్డిలు పేర్కొన్నారు. మధ్యప్రదేశ్‌లో జరిగే జాతీయ స్థాయి సైన్స్‌ ఫెయిర్‌కు స్థానిక బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు బయలుదేరారు. ఈ సందర్భంగా గురువారం వారిని అభినందించారు. అనంతరం వారు మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగిఉన్న సృజనాత్మకతను వెలికితీసే విధంగా ప్రోత్సాహనందించాలన్నారు. సైన్స్‌ ఫెయిర్‌లో చక్కటి నైపుణ్యం చాటి పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రూపేందర్‌రెడ్డి, సర్పంచ్‌ చంద్రకళ, ఎంపీటీసీ బాలయ్య, ప్రధానోపాధ్యాయుడు రాంరెడ్డి, రాంచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దుప్పట్లు, హెల్త్‌కిట్ల పంపిణీ



నిరుపేదలకు దుప్పట్లు, హెల్త్‌కిట్లు పంపిణీ చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్‌ స్వర్ణ సుధాకర్‌రెడ్డి

స్టేషన్‌ మహబూబ్‌నగర్‌: లయన్స్‌ క్లబ్‌ ఆఫ్‌ మహబూబ్‌నగర్‌ ఆధ్వర్యంలో గురువారం స్థానిక జెడ్పీ మైదానం సమీపంలోని శ్రీద్వారకామాయి బాబా మందిరం ప్రాంగణంలో నిరుపేదలకు జెడ్పీ చైర్‌పర్సన్‌ స్వర్ణ సుధాకర్‌రెడ్డి, లయన్‌ నటరాజ్‌లు దుప్పట్లు, హెల్త్‌కిట్లు పంపిణీ చేశారు. దాదాపు 100 మందికి దుప్పట్లు, హెల్త్‌కిట్లు పంపిణీ చేసినట్లు ప్రతినిధులు తెలిపారు. అనంతరం జెడ్పీ చైర్‌పర్సన్‌ను సన్మానించారు. కార్యక్రమంలో లయన్స్‌ క్లబ్‌ ఆఫ్‌ మహబూబ్‌నగర్‌ అధ్యక్షుడు మండ్ల రాములు, అశోక్‌యాదవ్‌, గోవర్దన్‌చారి, శ్రీహరి, చంద్రకాంత్‌రెడ్డి, లక్ష్మణ్‌గౌడ్‌, భానుప్రకాశ్‌ తదితరులు పాల్గొన్నారు.

బహిరంగసభను విజయవంతం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న రవీందర్‌రెడ్డి

కోయిల్‌కొండ: నారాయణపేటలో ఈనెల 24వ తేదీన మంత్రి కేటీఆర్‌ రానున్న సందర్భంగా ఏర్పాటు చేస్తున్న బహిరంగసభకు బీఆర్‌ఎస్‌ నాయకులు మండలం నుంచి పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని నియోజకవర్గ సమన్వయకర్త రవీందర్‌రెడ్డి అన్నారు. గురువారం మండల పరిషత్‌ కార్యాలయంలో ఏర్పాటు చేసిన బీఆర్‌ఎస్‌ కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా నారాయణపేట నుంచి కోయిల్‌కొండ వరకు డబుల్‌రోడ్డు నిర్మాణం కోసం మంత్రి కేటీఆర్‌ శంకుస్థాపన చేయనున్నట్లు వారు తెలిపారు.

వేతనాల్లో కోత విధించిన వారిపై చర్యలు తీసుకోవాలి



సోమశేఖర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న కార్మికులు

జడ్చర్ల టౌన్‌: బాదేపల్లి, బాలానగర్‌ సీహెచ్‌సీలలో పనిచేస్తున్న కార్మికుల వేతనాల్లో కోత విధిస్తున్న ఏజెన్సీ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని డీసీహెచ్‌ఎస్‌, బాదేపల్లి సూపరింటెండెంట్‌ డా. సోమశేఖర్‌కు తెలంగాణ మెడికల్‌ కాంట్రాక్ట్‌ వర్కర్స్‌ యూనియన్‌ జిల్లా అధ్యక్షుడు సురేష్‌ వినతి పత్రం సమర్పించారు. గురువారం ఆస్పత్రిలో కార్మికులతో మాట్లాడి సమస్యలను విన్నవించారు. జీఓ 60ప్రకారం వేతనాలు చెల్లించాల్సి ఉన్నప్పటికి వాటిలో కోత పెడుతున్న రెండు ఆస్పత్రిల ఏజెన్సీ నిర్వాహకులు వెంకటయ్య, శ్రీకాంత్‌లపై చర్యలు తీసుకోవాలన్నారు. వాస్తవానికి రూ.15,600 వేతనంలో పీఎఫ్‌ కట్‌చేసుకుని రూ.12,093 కార్మికుల ఖాతాల్లో వేయాల్సి ఉండగా కేవలం రూ. 8వేలు మాత్రమే వేస్తున్నారని ఆయన దృష్టికి తీసుకొచ్చారు. అలాగే కార్మికులకు ఈఎస్‌ఐ, పీఎఫ్‌ అమలు చేసేలా చూడాలన్నారు. లేదంటే ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఆయనతోపాటు కార్మికులు చిన్న, నాగరాజు, వినయ్‌, విజయలక్ష్మి, మనెమ్మ, అలివేల, సుక్కమ్మ, సత్తెమ్మ, శివలీల ఉన్నారు.

బాలికలకు చట్టాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న అధికారులు

హన్వాడ: మండల పరిధిలోని మాదారం, హన్వాడలలో గురువారం బాలికలకు బాలల చట్టాలపై అవగాహన కార్యక్రమం జరిగింది. మహిళా శిశు సంరక్షణ సంస్థ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో బాలికలకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన బాలల పరిరక్షణ కమిటీ ద్వారా విద్యార్థినులు బాలల హక్కులు, చట్టాలపై సోషల్‌వెల్ఫేర్‌ అధికారి వెంకటమ్మ అవగాహన కల్పించారు. మాదారంలో ప్రాథమిక పాఠశాల, హన్వాడలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగిన ఈ కార్యక్రమాల్లో మహిళా శక్తికేంద్రం కోఆర్డినేటర్‌ అరుణ, డీఈపీయూ నుంచి రమణ, సలోని, వాణి, ఆయా పాఠశాలల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు తదతరులు పాల్గొన్నారు.

అంధకారంలో ఇంటర్నల్‌ రహదారులు

- విద్యుత్‌ బకాయిలు చెల్లించని ఎల్‌అండ్‌టీ అధికారులు
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న పట్టణవాసులు

భూత్పూర్‌: స్థానిక మున్సిపల్‌ చౌరస్తాలోని బ్రిడ్జికి ఇరువైపులా ఉన్న అంతర్గత రహదారులు పక్కన ఎల్‌అండ్‌టీ కంపెనీ విద్యుత్‌ దీపాలు ఏర్పాటు చేశారు. గత 20 రోజులుగా ఇంటర్నల్‌ రహదారులు అంధకారంగా ఉండటంతో 9, 10, 4 వార్డులకు వెళ్లే ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. రాత్రి వేళల్లో దూర ప్రాంతాలను వచ్చే ప్రయాణికులకు బ్రిడ్జి చివరన వాహనాలు నిలిపి వేయడంతో భూత్పూర్‌ చౌరస్తాకు వచ్చే ఇంటర్నల్‌ రహదారులు చీకటిగా ఉండటంతో ఆందోళనకు గురవుతున్నారు. విద్యుత్‌ బకాయిలు ఉండటంతో స్థానిక అధికారులు కరెంట్‌ సరఫరా నిలిపివేశారు. చౌరస్తాలోని హైమాస్ట్‌ లైట్లు, బ్రిడ్జికి కింద ఏర్పాటు చేసిన లైట్లు మాత్రమే వెలుగుతున్నాయని, ఇంటర్నల్‌ రహదారిపై లైట్లు వెలగకపోవడంతో ప్రజలు ఎల్‌అండ్‌టీ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రజాప్రతినిధులు చొరవ తీసుకొని విద్యుత్‌ కనెక్షన్లు పునరుద్ధరించేలా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు, పట్టణ ప్రజలు కోరుతున్నారు.

బద్రునాయక్‌ కుటుంబాన్ని ఆదుకుంటాం

గండేడ్‌: ఆర్మీ జవాన్‌ బద్రునాయక్‌ కుటుంబానికి అన్ని రకాలుగా అండగా ఉండి ఆదుకుంటామని పరిగి ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని మన్సూర్‌పల్లి తండాలో గురువారం ఆయన మృతదేహాన్ని మండల కేంద్రం నుంచి మన్సూర్‌పల్లి తండా వరకు ప్రత్యేక వాహనంలో ఉంచి అంతిమ యాత్ర కొనసాగించారు. జాతీయ పతాకాలతో ర్యాలీ నిర్వహించారు. స్వగ్రామంలో పోలీసులు అధికార లాంచనాలతో మూడు రౌండ్లు గాల్లోకి కాల్పులు జరిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాస్‌రెడ్డి, మా జీ మండలాధ్యక్షుడు కొమిరె లక్ష్మయ్య, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ప్రహ్లాద్‌రావు, పద్మజారెడ్డి, ఏవీ రాములు, గిరమోని శ్రీనివాస్‌, పరమేశ్వర్‌, బీజేపీ అధ్యక్షుడు ప్రభునాయక్‌, రాజునాయక్‌ పాల్గొన్నారు.

స్వయం ఉపాధి శిక్షణ ప్రారంభం



జనశిక్షణ సంస్థాన్‌ను ప్రారంభిస్తున్న అధికారులు

కోయిల్‌కొండ: మండలంలో నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి అవకాశాల కోసం జనశిక్షణ సంస్థాన్‌ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన స్వయం ఉపాధి శిక్షణ కేంద్రాన్ని నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీటీసీ సభ్యుడు విజయ్‌భాస్కర్‌రెడ్డి, ఎంపీపీ శశికళ అన్నారు. గురువారం మండల కేంద్రంలో జనశిక్షణ సంస్థాన్‌ కేంద్రాన్ని వారు ప్రారంభించారు. ఈ కేంద్రంలో నిరుద్యోగులకు వివిధ వృత్తుల్లో శిక్షణ ఇచ్చి వారికి ఉపాధికి బంగారు బాట వేసేందుకు జనశిక్షణ సంస్థాన్‌ ముఖ్య ఉద్దేశమని వారు తెలిపారు. కావున నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు. కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత 'ఏకల్‌ కంప్యూటర్‌ బస్సు' ల్యాబ్‌

నవాబుపేట: ఏకల్‌ కంప్యూటర్‌ బస్సు ల్యాబ్‌ ద్వార ఉచిత శిక్షణ కార్యక్రమం మారుమూల గ్రామాల యువతకు చాలా మేలు చేస్తుందని కార్యక్రమ దాతలు క్రిస్టల్‌ కంపెనీ నిర్వాహకులు అరుణ్‌కుమార్‌, అన్వేష్‌రెడ్డిలు అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఉచిత కంప్యూటర్‌ విద్యా కార్యక్రమం ఏకల్‌ విద్యా ద్వార ఉచితంగా బస్సులో కంప్యూటర్‌ ల్యాబ్‌ సౌకర్యం కల్పించి యువతకు శిక్షణ ఇస్తున్నారు. ఈ కార్యక్రమాన్ని గురువారం స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మండలంలో పలు గ్రామాల్లో ఒక్కో బ్యాచ్‌లో 120 మంది యువతీయువకులను చేర్చుకుని వారికి 45 రోజుల పాటు ఉచితంగా కంప్యూటర్‌ శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్‌ అందిస్తారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ అనంతయ్య, సింగిల్‌విండో చైర్మన్‌ నర్సింహులు, మార్కెట్‌ చైర్మన్‌ లక్ష్మయ్య, ఏకల్‌ కార్యక్రమ నిర్వాహకులు రాఘవేందర్‌, ఏకల్‌ కమిటీ సభ్యులు ప్రేమ్‌ సుధాకర్‌, చంద్రశేఖర్‌, బచ్చు రామకృష్ణ, నర్సింహులు, అశోక్‌, వేణునాథం, స్వామి, మధుసూదన్‌రెడ్డి, చెన్నయ్య పాల్గొన్నారు.

29న కుమ్మరుల ఆత్మీయ సమ్మేళన సభ

పాలమూరు: మహబూబ్‌నగర్‌ జిల్లా కేంద్రంలో ఈనెల 29న కుమ్మర్ల ఆత్మీయ సమ్మేళన సభ నిర్వహిస్తున్నట్లు కుమ్మరి సంఘం జిల్లా అధ్యక్షుడు బుగ్గన్న, ప్రధాన కార్యదర్శి ఎల్లప్ప వెల్లడించారు. పట్టణంలోని రెడ్‌క్రాస్‌ భవన్‌లో గురువారం ఏర్పాటు చేసిన కుమ్మరి సంఘం సర్వసభ్య సమావేశంలో వారు మాట్లాడారు. ఉమ్మడి జిల్లాలో కుమ్మర్లు ఎదుర్కొంటున్న సమస్యలతో ప్రభుత్వం నుంచి పొందాల్సిన పథకాలపై చర్చించారన్నారు. ఆధునిక టెక్నాలజీ ఉపయోగించి మట్టి పాత్రల తయారీ, దీనికి ప్రత్యేక శిక్షణ ఇప్పించే ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ సభకు రాష్ట్ర ఎక్సైజ్‌ శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌ హాజరవుతారని, ఉమ్మడి జిల్లా నుంచి కుమ్మరులు అధికంగా తరలిరావాలన్నారు.

రసాభాసగా సర్వసభ్య సమావేశం

రాజాపూర్‌: గ్రామాల్లో అభివృద్ధి పనులు చేసి నెలలు గడుస్తున్న చేసిన పనులకు బిల్లులు రాక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని గురువారం జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో గ్రామాల సర్పంచ్‌లు ఆవేదన వ్యక్తం చేశారు. మండల పరిషత్‌ అధ్యక్షురాలు సుశీలరమేష్‌నాయక్‌ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం ప్రారంభమైంది. వ్యవసాయశాఖ మండల అధికారి నరేందర్‌ నివేదికను చదివి సమావేశాన్ని ప్రారంభించారు. మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు కప్పెరి బచ్చిరెడ్డి ఆధ్వర్యంలో సమావేశ మందిరానికి వెళ్లకుండ గంట వరకు కార్యాలయం కిందనే సర్పంచ్‌లు అందరు తమ సమస్యలను చర్చించుకున్నారు. చివరకు ఎంపీపీ సుశీల, ఎంపీడీఓ లక్ష్మీదేవిలు వచ్చి తమ సమస్యలను సమావేశంలో పాల్గొని సర్వసభ్యసమావేశంలో లేవనెత్తాలని సర్పంచ్‌లను కోరారు. ప్రజలచే ఎన్నుకోబడి గ్రామాల్లో సమస్యలను పరిష్కరించేందుకు సర్పంచ్‌లు రూ.లక్షల్లో ఖర్చుచేసి పనులు చేస్తే అధికారులు సహకరించకపోవడం సరిౖంది కాదని అసహనం వ్యక్తం చేశారు. డిజిటల్‌కీలను వెంటనే ఆయా గ్రామాల సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు అప్పగించాలని డీసీఎంఎస్‌ చైర్మన్‌ ప్రభాకర్‌రెడ్డి ఎంపీఓ వెంకట్‌రాములుకు సూచించారు. అంతేకాకుండ గ్రామాల్లో రోడ్లకు ఇరువైపుల నాటిన మొక్కలకు గ్రామపంచాయతీ ట్రాక్టర్‌లతో నీళ్లు పోసిన నీళ్ల పోయలేదని ఈజీఎస్‌ టెక్నికల్‌ అసిస్టెంట్‌ ఇబ్బంది పెడుతున్నారని బీబీనగర్‌ సర్పంచ్‌ గోవిందనాయక్‌ అధికారులముందు ఆవేదన వ్యక్తం చేశారు. రాజాపూర్‌ గ్రామ పంచాయతీలో ఒక కోటీ ముప్పై లక్షలకు పైగా బిల్లులు రావాల్సిందని సర్పంచ్‌ బచ్చిరెడ్డి తమ గోడును వెళ్లబోసుకున్నారు. ఏడీ తార్యానాయక్‌ సమాధానం ఇస్తు నిబంధనలకు విరుద్ధంగా పనులు చేయలేమని, డిపార్ట్‌మెంట్‌ కట్టాల్సిన డబ్బు చెల్లిస్తే పనులు చేసేందుకు వీలవుతుందని అన్నారు. కార్యక్రమంలో వైస్‌ ఎంపీపీ మహిపాల్‌రెడ్డి, ఉమ్మడి బాలానగర్‌, రాజాపూర్‌ మండలాల మార్కెట్‌కమిటీ చైర్మన్‌ రజినిజగన్‌నాయక్‌, తహసీల్దార్‌ రాంబాయి, ఎంపీడీఓ లక్ష్మీదేవి, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.



సర్వసభ్య సమావేశంలో అధికారులను నిలదీస్తున్న సర్పంచ్‌లు

యువతి అదృశ్యం.. కేసు నమోదు

మహమ్మదాబాద్‌: అన్న దగ్గరికి వెళ్తానని చెప్పి ఇంటి నుంచి వెళ్లిన యువతి అదృశ్యమైంది. వివరాల ప్రకారం.. గండేడ్‌ మండల పరిధిలోని అంచన్‌పల్లికి చెందిన ఓ యువతి బుధవారం హైదరాబాద్‌లో ఉన్న అన్న వద్దకు వెళ్తానని చెప్పడంతో తల్లి మధ్యాహ్నం 2గంటలకు గ్రామంలో బస్సు ఎక్కించింది. సాయంత్రం యువతికి తల్లి ఫోన్‌ చేయగా కలవలేదు. దీంతో అనుమానం వచ్చి కుమారుడికి ఫోన్‌ చేసి కూతురు వచ్చిందా అని అడగగా రాలేదని చెప్పాడు. దీంతో ఆమె ఆచూకీ కోసం చుట్టూ పక్కల గ్రామాలతో పాటు బంధువుల వద్ద వెతికింది. ఎక్కడ కూడ ఆమె ఆచూకీ దొరక్కపోవడంతో గురువారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈమేరకు మహమ్మదాబాద్‌ పోలీసులు మిస్సింగ్‌ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారన్నారు.

ఫోన్‌ మాట్లాడుకుంటూ వెళ్లి..

మిడ్జిల్‌: మండల కేంద్రానికి చెందిన యువతి(19) బుధవారం రాత్రి 9గంటల సమయంలో ఇంట్లో నుంచి ఫోన్‌ మాట్లాడుకుంటూ బయటకు వెళ్లి అదృశ్యమైంది. తల్లి బంధువుల ఇళ్లల్లో వెతికిన ఆచూకీ లభ్యం కాలేదన్నారు. ఈ మేరకు గురువారం యువతి తల్లి జంగమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెంకట్‌రామ్‌ నాయక్‌ తెలిపారు.